వినోదం.. విజ్ఞానం..

వేసవి సెలవులు ఇలా కానిద్దాం..

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలి

వారికి నచ్చిన అంశాల్లో శిక్షణ ఇప్పించేందుకు చొరవ తప్పనిసరి

క్రీడానైపుణ్యం పెంపొందించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, మే 14 : పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెల్సిందే.ఈ నేపథ్యంలో పిల్లలకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించడం ద్వారా వారి అభిరుచి మెరుగుపర్చుకునేందుకు తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి. ప్రస్తుతం మనమున్నది పోటీ ప్రపంచం కావడంతో పిల్లల్ని వినోదాల ద్వారా కాలక్షేపం కోసం వదిలేయకుండా వారిలోని స్కిల్స్‌ను మెరుగుపర్చే శిక్షణ ఇప్పించేందుకు కృషి చేయాలి. పెద్ద పిల్లలైతే వారు చదివే కోర్సుకు ఉపయోగపడే అదనపు విషయాలను నేర్పే చోటికి పంపాలి. క్రీడలతో పాటు అనేక రకాలుగా మన జీవితంలో ఉపయోగపడే విషయాలను పిల్లలు నేర్చుకునేలా చూడటంతో పాటు వారు పోటీ ప్రపంచంలో దూసుకుపోయే విధంగా తర్ఫీదునిప్పించాలి. ఆధునిక సమాజంలో విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరం. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ప్రత్యేకంగా సెలవుల్లో నేర్పుకొని సాధన చేస్తే భవిష్యత్‌కు బంగారు బాట వేసినట్లే. చాలా మంది యువకులు ఈ నైపుణ్యం లేక వెనుకబడిపోతున్నారు. మనదేశంలో ఒక ప్రముఖ సంస్థ ఈ విషయమై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం దేశంలో కేవలం 19 శాతం యువకులు మాత్రమే కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉన్నారని తెలిపింది. సెలవుల్లో వీటిని నేర్చుకోవడం ద్వారా సెలవులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు భవిష్యత్‌లో ఉపయోగపడుతుంది. జీవితంలో ఉపయోగపడే విషయాలను పిల్లలు నేర్చుకునేలా చూడటం ద్వారా సెలవులు ఈజీగా గడిపేయవచ్చునని వైద్య నిపుణులు అంటున్నారు.

మెదడుకు మేతతో జ్ఞాపకశక్తికి ఊతం..

చిన్నారుల మెదడును చురుకుగా ఉంచాలంటే దానికి ఎప్పుడు ఏదో పని చెప్పాలి. అందుకే పిల్ల మెదడును చురుకుగా ఉంచే ప్రతిప్రయత్నాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. చదరంగం ఆట, సుడోకు లాంటి పజిల్స్ మెదడును ఉత్తేజ పరుస్తాయి.

పదసంపదను పెంచండి..

నేటి ఆధునిక యుగంలో ఏ భాషలోనైనా పట్టుసాధించాలి. అందుకు దానికి సంబంధించిన పద పరిజ్ఞానం ఎంతో అవసరం. పదం కోసం పరితపించే సంభాషణను చేస్తూ ఉంటే పదాల గురించి కుస్తీపట్టే పనుండదు. మనపేరు గుర్తుకొచ్చినంత సులభంగా పదాలు గుర్తుకొస్తాయి. స్కూల్, కళాశాలలో చదువుతున్న రోజుల్లో అంత సమయం ఉండదు. కాబట్టి సెలవుల్లో పద పరిజ్ఞానంపై దృష్టి పెడితే భాషపై పట్టు సాధించడం సులభమవుతుంది.



చేతిరాత మెరుగుతో మార్కులు అధికం..

పరీక్షల్లో చేతిరాత చాలా ముఖ్యం. ఏ పరీక్ష అయినా రాసే సమాధానాలను మంచి చేతిరాతతో రాస్తే చదవడానికి ఎంతో బాగుంటుంది. దీంతో ఆయా పరీక్షల్లో మంచి మార్కులు వచ్చే అవకాశముంది. పాఠశాలలో చేతిరాత బాగాలేక టీచర్లచేత చివాట్లు తిన్న వారంతా ఈ సెలవుల్లో చేతిరాత మెరుగుపరిచే శిక్షణా తరగతులకు వెళ్లడం మంచిది. పట్టణాల్లో కాలిగ్రఫీ నిపుణులు ప్రత్యేక శిక్షణ తరగతులు పెట్టి చేతిరాతపై శిక్షణ ఇస్తుంటారు. వీటికి సంబంధించిన డీవీడీలు, పుస్తకాలు కూడా మార్కెట్‌లో లభిస్తాయి. రోజుకి గంట సమయాన్ని కేటాయిస్తే మీ చేతిరాతను మెరుగుపర్చుకోవచ్చును.

భాషపై పట్టుతో భవితకు నాంది..

భాషమీద పట్టు అవసరం. అది తెలుగు లేదా ఇంగ్లీష్ ఏదైనా కావచ్చు. తెలుగు మాతృభాష అయితే ఇంగ్లీష్ బతుకు నేర్పే భాష. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మాట్లాడటానికి ఇంగ్లీష్ అవసరం. భాష వేరు కమ్యూనికేషన్ స్కిల్స్ వేరు. భాష అనేది అందులో ఒక భాగం మాత్రమే. కాబట్టి భాష మీద పట్టులేకపోతే కమ్యూనికేషన్ కూడా దెబ్బతింటుంది. కాబట్టి వేసవి సెలవుల్లో భాషపై దృష్టి పెడితే అది జీవితకాలమంతా మనల్ని కాపాడుతుంది. ఒక స్థాయిలో నిలబెడుతుంది.

టెక్నాలజీని సొంతం చేసుకోవాలి

నేటి ఆధునిక యుగంలో టెక్నాలజీ వినియోగం లేనిదే ఏ పని జరుగడంలేదు. నేడు కంప్యూటర్ టెక్నాలజీ ప్రతి వ్యక్తికి ప్రాథమిక అవసరం. రానున్న రోజుల్లో ఉద్యోగ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరిగే అవకాశం ఉంది. అందుకే ప్రతి ఒక్కరు కంప్యూటర్ టెక్నాలజీని నేర్చుకోవడం ఎంతో అవసరం. ఎంఎస్‌వర్డ్, ఎంఎస్‌ఎక్సెల్, ఎంఎస్ ఆఫీస్ వస్తే వివిధ ఆఫీసుల్లో చిన్నచితక ఉద్యోగాలు గ్యారంటీ. మీ సొంతం పనులకు వేరే వారిపై ఆధారపడకుండా మీరే చేసుకోవచ్చు. కాబట్టి వేసవి సెలవుల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవడానికి ప్రాధాన్యతనివ్వాలి.

పుస్తకాలు చదువండి..

సెలవుల్లో రోజుకి గంట సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయిస్తే ఎంతో విజ్ఞానం పెరుగుతుంది. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లల్లో ఉత్తేజాన్ని కలిగించేవి, వారి భవిష్యత్‌కు, పరిజ్ఞానాన్ని ఉపయోగపడే పుస్తకాలను వారికి అందుబాటులో ఉంచి అవి చదివేలా చూడాలి. ఉదాహరణకు సమయపాలన, భావోద్వేగాల అదుపు, మైండ్‌మెసేజ్, వంటి పుస్తకాలు చదివితే విద్యార్థుల్లో ఉత్తేజంతో పాటు ఆత్మవిశ్వాసం కలుగుతుంది.

ఆటలు, వ్యాయామంపై ఏకాగ్రత తప్పనిసరి

వ్యాయామాలు ఫిజికల్‌గా, ఫిట్‌గా ఉంచుతాయి. మీ భావోద్వేగాలను అదుపులో ఉంచుతాయి. మీలో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయి. రోజుకు గంటపాటు వ్యాయామాలు చేస్తే మరోపూట తప్పక ఆటలు ఆడండి. వేసవిలో కొంతమంది ప్రత్యేక శిక్షకులు వ్యాయామాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. వీటికి హాజరు కావడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుంది. దీంతో పాటు ఏకాగ్రత, మెమరీ ప్రాసెస్‌కూడా మెరుగవుతాయి.

స్విమ్మింగ్ తప్పనిసరి

స్విమ్మింగ్ అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమైనది. స్విమ్మింగ్ కోసం ప్రత్యేకించి సమయం లేకపోవటం వలన ఎక్కువమంది ఈతకు దూరమవుతున్నారు. వేసవి సెలవుల్లో దగ్గరలో ఉన్న స్విమ్మింగ్‌పూల్స్‌కు వెళ్లి ఈత నేర్చుకోవటం ఎంతో అవసరం. ఇందుకనుగుణంగా స్విమ్మింగ్‌పుల్స్ కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా స్విమింగ్ ఉదయం, సాయంత్రం వేళలో అనుకూలంగా ఉంటుంది.

విద్యార్థులపట్ల సరైన జాగ్రత్తలు పాటించాలి

సెలవురోజుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా, వారి దృష్టి ఇతర విషయాలపైకి వెళ్లకుండా వ్యాయామం, విద్య, వినోదం లాంటి వాటిపై దృష్టి సారించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. పాఠశాలలకు వెళ్లినప్పుడే చదువుకోవాలనేది కాకుండా సెలవు రోజుల్లో కూడా వారికి చేదోడు వాదోడుగా ఉంటూ వారు జీవితంలో సాధించాల్సిన వాటిపై దృష్టి సారించేందుకు కృషి చేయాలి.

–మహేందర్, ప్రధానోపాధ్యాయుడు

వ్యాయామంతో నూతనోత్తేజం..

విద్యార్థులు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట, రెండు గంటల పాటు క్రీడలు, వ్యాయామంపై దృష్టి సారిస్తే నూతన ఆలోచనలు వస్తాయి. మెమరీకూడా షార్ప్‌గా అవుతుంది. తల్లిదండ్రులు సెలవుల్లో పిల్లలు సమయాన్ని వృథా చేసుకోకుండా చూసుకోవాలి. వ్యాయామంతో పాటు బాడిఫిట్‌గా ఉండటంతో పాటు విద్యలో కూడా ముందుంచేందుకు ఎంతో కృషిచేస్తుంది.

-కౌశిల్‌రెడ్డి, వైద్య నిపుణులు

స్ఫూర్తివంతమైన ప్రసంగాలు వినండి

జీవన రంగంలో అత్యున్నత స్థానాలను అందుకొని పలువురికి ఆదర్శంగా ఉన్న స్ఫూర్తిదాతల ప్రసంగాలను వినడాన్ని పిల్లలకు అలవాటు చెయ్యాలి. అవి పిల్లలను ఆశాజనకమైన భవిష్యత్తువైపు నడిపిస్తాయి. ఈ వేసవి సెలవుల్లో రోజు ఒకగంట సమయాన్ని కేటాయించి అంతర్జాలంలో ఉన్న వీరి ప్రసంగాలను విన్నవారంతా ఆదర్శవంతమైన జీవితాన్ని గడపడానికి ఎన్నో అనుభవాల్ని సొంతం చేసుకుంటారనే విషయం వారికి తెలియజేయాలి.

ప్రతిభకు పదును పెట్టుకోవడం..

చాలా మంది విద్యార్థులు గణితశాస్త్రంలో మంచి మార్కులు సాధించడానికి ఎబాకస్‌వేరు గణితం, స్పీడు మాథ్స్‌లాంటి ప్రత్యేక విజ్ఞానాన్ని సంపాదించుకుంటారు. వేసవిసెలవుల్లో బాగా సాధన చేసి స్కూల్ తిరిగి ప్రారంభించిన తరువాత వారి ప్రతిభను పెంచుకుని మంచి మార్కులను సంపాదించుకోవచ్చు. నేర్చుకునే సమయంలో ఇష్టంతో నేర్చుకోవడాన్నే ఎంజాయ్‌మెంట్ అని విద్యార్థులకు తల్లిదండ్రులు అర్థమయ్యేలా చెప్పాలి. ఆ దిశగా వారిని అలవాటు చెయ్యాలి.

కార్యకర్తల పనితీరు భేష్

- **మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్**

షాద్‌నగర్, మే14 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త బాగా పని చేశారని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల పాటు ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా పని చేశారన్నారు. నియోజకవర్గంలో 77.42 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషకరమని, ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆమనగల్లు (మాడ్గుల), మే 14 : మాడ్గుల మండల పరిధిలోని నాగిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2002-2003 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చాట్ల యాదగిరి, శ్రీను, జగన్, శ్రీశైలం, అశోక్, యాదగిరి, శ్రీశైలం, తిరుపతి, కుమార్, వెంకటయ్య, నర్సింహ, రమేశ్, సంతోష, శారద, పద్మ, గీత, అవంతి, నిర్మల, విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, మే 14 : ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రభు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు విడుతల్లో జరిగే ప్రవేశాలకు దరఖాస్తుల ప్రకియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 25 వరకు మొదటి దశలో రూ.200తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మే 15 నుంచి మే 27 వరకు దోస్త్ వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, జూన్ 3న మొదటి దశ సీట్లు కేటాయించి, జూన్ 4 నుంచి 10 వరకు సెల్ఫ్ రిపోర్ట్‌కు అవకాశం కల్పించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభు పేర్కొన్నారు. అనంతరం రెండవ దశ, మూడవ దశలు కూడా ఉంటాయన్నారు. ఆగస్టు 2023 (బీఆర్ఎస్ ప్రభుత్వంలో)లో మంజూరైన డిగ్రీ కళాశాల నాలుగు మండలాల కూడలి అయిన ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాల మంజూరయ్యే సమయానికి విద్యార్థులందరూ వివిధ కళాశాలలో చేరడంతో ఆమనగల్లు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు జరగలేదు. ప్రస్తుతం దోస్త్ నోటిఫికేషన్ విడుదల కావడంతో విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

లాఠీచార్జి కారకులపై చర్యలు తీసుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 : ఉపాధ్యాయుల పై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కరంటోత్ మహిపాల్ మంగళవారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం టీఏ/డీఏ చెల్లించాలన్నందుకు పోలీసుల బలప్రయోగం లాంటి ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

భగీరథుడే మిషన్ భగీరథకు స్ఫూర్తి : ఎమ్మెల్యే గాంధీ

భగీరథ మహర్షి జయంతిలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సంఘం ప్రతినిధులు

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

మియాపూర్, మే 14: ఒంటి కాలిపై తపస్సు చేసి సమస్త జీవకోటికి ప్రాణాధారమైన గంగను భువికి తీసుకువచ్చిన భగీరథ మహర్షి యావత్ జాతికి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆ మహర్షి స్ఫూర్తిగా తొలి సీఎం కేసీఆర్ తెలంగాణలో ప్రతి గడపకు తాగునీటిని అందించిన పథకానికి మిషన్ భగీరథగా నామకరణం చేసి ఆ మహనీయుడికి తగిన గౌరవం ఇచ్చారన్నారు. జగిద్గిరిగుట్ట సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. సగర సంఘం అభివృద్ధికి తన పూర్తి తోడ్పాటును అందిస్తానని, అన్ని వేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహర్షి జీవిత చరిత్రను తరతరాలకు అందించేలా సంఘం ప్రతినిధులు పాటుపడాలని ఎమ్మెల్యే గాంధీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంగారావు, సంజీవ రెడ్డి, సంఘం ప్రతినిధులు కొండయ్యసాగర్, శ్రీనివాస్‌సాగర్, రాజేష్‌సాగర్, వెంకటస్వామి సాగర్, రవిసాగర్, వెంకటరాములు, రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం..

బడంగ్‌పేట, మే14: పార్లమెంట్ ఎన్నికల్లో ఇన్ని రోజులు ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీల నేతలు బిజీ బిజీగా గడిపారు. పార్లమెంట్ ఎన్నికలలో ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఎత్తుకు పై ఎత్తులు వేశారు. ఓటర్లను తమ వైపు మలుపు కోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. ఇంటింటి ప్రచారాలు, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు పెట్టి బలనిరూపన ప్రదర్శనలు చేశారు. ఓటర్ మనస్సు గెలుచుకోవడానికి చేయవలసిన ప్రయత్నాలు అన్ని చేశారు. ఓటర్లు మాత్రం సైలెంట్‌గా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహేశ్వరం నియోజక వర్గం లో ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఫలితాలు ఇంకా 20 రోజులు ఉండటంతో ఇక నేతల చూపంతా ఫలితాల వైపు మళ్లింది. ఎన్నికల సమరం ముగియడంతో కాలక్షేపం కోసం ఇతర ప్రాంతాలకు పోనున్నట్లు వారి అనుచరగణం చెబుతున్నారు. ఫలితాలు వచ్చేదాక అభ్యర్థుల గుండె లబ్ డబ్ అంటూనే ఉంటుంది. అందరి చూపు పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూపులు మొదలయ్యాయి.

మిషన్ భగీరథ నీళ్లను వృథా చేయొద్దు

- **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మే 14 : ప్రజల అవసరాలకు అనుగుణంగా మిషన్ భగీరథ నీళ్లను వినియోగించుకోవాలని, ఎట్టి పరిస్థితిలో నీళ్లను వృథా చేయకూడదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, ప్రజలకు సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. వాటర్ ప్లాంట్ నుంచి సమీపంలో ఉన్న గురుకుల పాఠశాల ఆవరణలోకి నీళ్లు వెళ్తున్నాయని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని గురుకుల పాఠశాల ఆవరణలోకి నీళ్లు వెళ్లకుండ పనులు చేపట్టాలని సూచించారు. వర్షపు నీళ్లు సహితం పాఠశాల పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా దారి మళ్లించాలని చెప్పారు. మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ నుంచి వెలువడే నీళ్లను వన్య ప్రాణుల కోసం వినియోగించాలని సూచించారు. ప్లాంట్ సాంకేతిక లోపాలను సరిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాను సక్రమంగా నిర్వర్తించాలని, అన్ని కాలనీలకు నీళ్లు సరఫరా అయ్యేలా చొరవ చూపాలని అన్నారు. నీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించాలన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాలత పాఠశాలలోని పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్‌రావు, డీఈ సందీప్, ఏఈ రూప, నాయకులు పాల్గొన్నారు.

అలుపెరగకుండా శ్రమించారు

మియాపూర్, మే 14: ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకున్న నియోజకవర్గ ఓటర్లతో పార్టీ శ్రేణులకు, బీఆర్ఎస్ అభిమానులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన స్వల్ప కాలంలోనే పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పటికీ తనకు అఖండ మెజార్టీ అందించడమే కాకుండా.. బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని గెలుపుకోసం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు తామే అభ్యర్థిలా భావించి అలుపెరగకుండా శ్రమించారని అభినందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే గాంధీ మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కార్యకర్తలే ఎప్పటికయినా పార్టీకి బలమని, బలగమని గులాబీ సైనికులు ఈ ఎన్నికల ద్వారా మరోసారి నిరూపించారని ఈ సందర్భంగా నియోజకవర్గ, డివిజన్, కాలనీ, బూత్ స్థాయి నేతలు, మహిళా కార్యకర్తలకు ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు ఎన్నికలలోనూ ఇదే స్ఫూర్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళ అదృశ్యం

సాయవ్వ

మియాపూర్, మే 14: కూలీ పనులకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకున్నది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మక్తకు చెందిన పోచయ్య సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా.. ఆయన భార్య సాయవ్వ(50) కూలీ పనులు చేస్తున్నది. రోజువారీ కూలీ పనుల నిమిత్తం 7వ తేదీన సాయవ్వ మియాపూర్ అడ్డాకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మియాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికలకు సహకరించిన నేతలకు కృతజ్ఞతలు

బడంగ్‌పేట, మే14: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలలో సహకరించిన బీఆర్ఎస్ నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రచారం తనకు తోడుగా వెన్నంటి ఉన్న వారందరికీ ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. తన గెలుపు కోసం కష్ట పడి పని చేసి ఓట్లు వేయించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్‌కు, మాజీ మంత్రి కేటీఆర్‌కు, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నాయకుల పరామర్శ.. ఆర్థికసాయం



కడ్తాల్ గ్రామంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, మే 14 : మండల కేంద్రానికి చెందిన తిరుపతి యాదమ్మ, కోశిక ఆండాళు వివిధ కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం సాయంత్రం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు తరపున జడ్పీటీసీ దశరథ్‌నాయక్ రూ.10 వేలు, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టు తరపున వెంకటేశ్‌గుప్తా రూ.10 వేలు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు రాఘవేందర్, శ్రీనివాస్, వెంకటేశ్, నాగార్జున్, రవి, చెన్నకేశవులు, శ్రీరాములు, రమేశ్, దేవేందర్, యాదయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కడ్తాల్, మే 14 : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌వో శివప్రసాద్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోశిక ఆండాళు (40) రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం వాకిలి ఊడిచి చెత్తన్తు పారబోయడానికి ఇంటి ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆమె కుడి చేతి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలికి భర్త మల్లేశ్, కుమారుడు సంజయ్, కుమార్తె శ్రావణి ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రీభగీరథ మహర్షుల జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సగర కులస్తుల సమస్యలు పరిష్కరిస్తా

మన్సూరాబాద్, మే 14: సగర కులస్తుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి అభివృద్ధికి తన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లోని మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో మంగళవారం నిర్వహించిన సగరుల కులదైవం శ్రీ భగీరథ మహర్షుల జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భగీరథ మహర్షుల చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సగరులు ఉద్యోగ, విద్యారంగంలో మరింతగా ఎదిగి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా నిలువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ సాగర్, లక్ష్మీనారాయణ, శ్రీను, రాఘవ, నాగరాజు, చిన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్ సమీపంలోని కొనుగోలు కేంద్రం వద్ద పేరుకుపోయిన వరిధాన్యం

ధాన్యం.. దైన్యం..

ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం.. ఆందోళనలో అన్నదాతలు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 14 : ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యం అమ్ముకుందామంటే ప్రభుత్వం మొహం చాటేస్తుంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అకాల వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియక బిక్కు...బిక్కుమంటూ పండించిన ధాన్యంతో కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షిస్తున్నప్పటికి ఏ ఒక్కరు కూడా ఇటువైపు చూడటంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పోల్కంపల్లి, దండుమైలారం సహకార సంఘాల పరిధిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి ఎప్పటికప్పుడు రైతుల ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో కొనుగోలు కేంద్రాల్లోనే నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులు నష్టపోకుండా ఉండటం కోసం వెంటనే వరిధాన్యం కొనుగోలు చేయాలని ఉత్తమరైతు మొద్దు అంజిరెడ్డి కోరారు.